అక్షర దర్బార్

www.aksharadarbar.com

voice of the people

వెల ₹5

బుధవారం 05, మార్చి 2025 | సంపుటి :02 | సంచిక :24 | పేజీలు :04


# గీత దాటొద్దు

- అంతర్గత విషయాలు బయట మాట్లాడొద్దు
- నా పనితీరు నచ్చకపోతే హైకమాండ్‌కు ఫిర్యాదు చేయొచ్చు
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- పీసీసీ అనుబంధ సంఘాలు, ఆదిలాబాద్ జిల్లా నేతలతో సమీక్ష



04

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో

# వేగం పెంచాలి

బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

04



### కాంగ్రెస్‌ను

# రేవంత్ ఖతం చేస్తడు

02



- సీఎం కుర్చీకి తానే పునాది వేశా..
- 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం..
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్

02

- కాంగ్రెస్‌కు 3.. సీపీఐకి 1 దక్కే ఛాన్స్ !
- ఏఏ సమాజికవర్గాలకు ప్రాతినిధ్యం దక్కుతుందనే చర్చ
- ముఖ్యమంత్రి రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు !
- ఈనెల 6వ తేదీన ఏఐసీసీకి జాబితా !
- 8వ తేదీలోపు ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
- నామినేషనకు చివరి గడువు ఈనెల 10

# ఉత్కంఠ

## టీ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ కోసం పోటాపోటీ..

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల కేటాయింపుపై కాంగ్రెస్‌లో కసరత్తు కొలిక్కి వస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా అందులో నాలుగు కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశం ఉంది. దీంతో ఆ నాలుగు ఏఏ సామాజిక వర్గాలకు దక్కుతాయో అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడి వద్దకు పదుల సంఖ్యలో బయోడేటాలు వచ్చినట్లు సమాచారం. ఇందులో అన్ని సామాజిక వర్గాలత ో పాటు పార్టీలో సీనియర్లు, యువ నాయకులు ఉన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలవడంతో ఇక అభ్యర్థుల ఎంపికపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఈ నాలుగింటిలో ఒక్క ఎమ్మెల్సీ తమకు ఇవ్వాలని సీపీఐ పట్టుబడుతోంది. ఈక్రమంలోనే ఇవాళ ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డితో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అవడం ప్రాధాన్యం సంతరించికుంది. ఈ సమావేశానికి మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థులపై వీరంతా చర్చించినట్లు సమాచారం. ఫైనల్‌గా ఎస్సీ, ఓసీ, మహిళకు ఒక్కో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, మిగిలిన మరో సీటును సీపీఐకి కేటాయించాలని, ఆ పార్టీలోని బీసీ నేతకే ఛాన్స్ ఇవ్వాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో అవకాశం దక్కని వారికి త్వరలో చేపట్టే నామినేటెడ్ పోస్టుల్లో ఛాన్స్ ఇచ్చి సంతృప్తి పర్చే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. -అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి



- జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- ప్రజల వద్దకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- వరంగల్ పశ్చిమలోని 26 డివిజన్లలో పర్యటనలకు శ్రీకారం
- సమస్యలు తెలుసుకుంటూ స్థానికులతో మమేకం
- హామీలన్నీ అమలుచేస్తానని భరోసా..



04

# గ్రేటర్ టార్గెట్!

# ఆడపడుచే హంతకురాలు

- వివాహిత శిరీష హత్య కేసులో ట్విస్ట్
- పోలీసుల అదుపులో నిందితులు
- మృతురాలి స్వగ్రామం పరకాల..

03





03

# ఇంటర్ పరీక్షలు షురూ..

ఎగ్జామ్ సెంటర్లను తనిఖీ చేసిన అధికారులు



### నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న

# ముఠా అరెస్ట్

02

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



# ఉత్కంఠ!

- టీ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ కోసం పోటాపోటీ..
- కాంగ్రెస్‌కు 3.. సీపీఐకి 1 దక్కే ఛాన్స్ !
- ఏఏ సమాజికవర్గాలకు ప్రాతినిధ్యం దక్కుతుందనే చర్చ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ భేటీ
- అభ్యర్థుల ఎంపికపై కసరత్తు !
- ఈనెల 6వ తేదీన ఏఐసీసీకి జాబితా !
- 8వ తేదీలోపు ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన
- నామినేషన్లకు చివరి గడువు ఈనెల 10

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవుల కేటాయింపుపై కాంగ్రెస్‌లో కసరత్తు కొలిక్కి వస్తోంది. రాష్ట్రంలో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా అందులో నాలుగు కాంగ్రెస్ పార్టీకి దక్కే అవకాశం ఉంది. దీంతో ఆ నాలుగు ఏఏ సామాజిక వర్గాలకు దక్కుతాయో అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడి వద్దకు పదుల సంఖ్యలో బయోడేటాలు వచ్చినట్లు సమాచారం. ఇందులో అన్ని సామాజిక వర్గాలతోపాటు పార్టీలో సీనియర్లు, యువ నాయకులు ఉన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలవడంతో ఇక అభ్యర్థుల ఎంపికపై సీరియస్‌గా దృష్టి సారించారు. ఈ నాలుగింటిలో ఒక్క ఎమ్మెల్సీ తమకు ఇవ్వాలని సీపీఐ పట్టుబడుతోంది. ఇప్పటికే పీసీసీ ఛీప్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి నాయకులు విన్నవించారు. ఈక్రమంలోనే ఇవాళ ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డితో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అవడం ప్రాధాన్యం సంతరించికుంది. ఈ సమావేశానికి మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థులపై వీరంతా చర్చించినట్లు సమాచారం. ఫైనల్‌గా ఎస్సీ, ఓసీ, మహిళకు ఒక్కో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని, మిగిలిన మరో సీటును సీపీఐకి కేటాయించాలని, ఆ పార్టీలోని బీసీ నేతకే ఛాన్స్ ఇవ్వాలని పీసీసీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో అవకాశం దక్కని వారికి త్వరలో చేపట్టే నామినేటెడ్ పోస్టుల్లో ఛాన్స్ ఇచ్చి సంతృప్తి పర్చే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది.

## సీపీఐకి ఇచ్చినా బీసీలకే ఛాన్స్..?

ఎమ్మెల్సీ పదవని తమకు కేటాయించాలని సీపీఐ పట్టుబడుతోంది. పొత్తులో భాగంగా ఒక ఎమ్మెల్యే, రెండు ఎమ్మెల్సీ స్థానాలను తమకు కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని చెపుతోంది. అందులో భాగంగా తమకు ఒక ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని కోరుతోంది. అయితే సీపీఐకి కేటాయించాల్సి వస్తే బీసీ సామాజికవర్గానికి ఇవ్వాలని షరతు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొన్న సీపీఐ నేతలు గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్‌ను కలిసిన సందర్భంలోనూ బీసీ అభ్యర్థి పేరు సూచించాలని మహేష్ కుమార్ గౌడ్ సీపీఐ నేతలను కోరినట్లు సమాచారం. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థికే కేటాయించాలనుకుంటే బీసీకే ఛాన్స్ ఇవ్వాలని పీసీసీ నిర్ణయం తీసుకుందని సమాచారం. ఈక్రమంలోనే బీసీ నుంచి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు కొందరి పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ఏఐసీసీకి ఈనెల 6న జాబితాను పంపేందుకు సిద్ధమవుతోంది. 8వ తేదీ వరకు ఎమ్మెల్సీ అభ్యర్థులు ఫైనల్ అయ్యే ఛాన్స్ ఉంది.

## ఫుల్ డిమాండ్..

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించింది. నామినేషన్ల విత్ డ్రాకు 13 వరకు ఛాన్స్ ఉంది. 20న ఎన్నికలు జరగనుండగా అదే రోజు ఫలితాలు కూడా వెల్లడికానున్నాయి. ఒకవేళ ఏకగ్రీవం కాకపోతే శాసనసభలో పోలింగ్ నిర్వహించి.. అదే రోజు ఓట్లు లెక్కిస్తారు. ఈనెల 24 నాటికి ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, యెగ్గె మల్లేషం, మినాజ్ రియాజుల్ హుస్సేన్ పదవీకాలం ఈనెల 29న ముగియనుంది. రెడ్డి, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజికవర్గాల నుంచి ప్రస్తుతం ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండడంతో ఆయా వర్గాలతోపాటు ఇతర కులాల నేతలు కూడా పెద్దల సభ సీటుకు పోటీపడుతున్నారు. పార్టీ ఓకే చెప్తే గెలుపు గ్యారెంటీ కావడంతో ఎమ్మెల్యే కోటా పదవులకు ఫుల్ డిమాండ్ పెరిగింది.



# కాంగ్రెస్ ను రేవంత్ ఖతం చేస్తడు

- సీఎం కుర్చీకి తానే పునాది వేశా..
- 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం..
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్

అక్షరదర్బార్, హైదరాబాద్: ప్లాన్ ప్రకారం కాంగ్రెస్‌ను ఖతం చేసే పనిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ .. ప్రధాని మోదీ ఒకరికి ఒకరు సహకరించుకుంటున్నారని ఆరోపించారు. రేవంత్ సహకారంతోనే మల్కాజిగిరి, చేవెళ్ళ, మహబూబ్‌నగర్ ఎంపీలను బీజేపీ గెలిచిందని అన్నారు. బలమైన కేసీఆర్‌తో తాను కొట్లాడినప్పుడు రేవంత్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ ఎంపీగా వంశీచంద్ రెడ్డిని.. రేవంత్ రెడ్డే ఓడించారన్నారు. మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలను గెలిపించుకోలేని రేవంత్ .. తనను గెలిపించారా అంటూ మండిపడ్డారు. రేవంత్ కూర్చున్న సీఎం కుర్చీకి పునాది పడటానికి తాను కారణమని స్పష్టం చేశారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారంటూ తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై మల్లన్న బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ముఖ్యమంత్రే కారణం

తనను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేయించి రేవంత్ రెడ్డి చాలా పెద్ద పొరపాటు చేశారని మల్లన్న అన్నారు. బీసీలకు రాజ్యాధికారం ఎందుకు రాదో.. చూస్తామన్నారు. ''నన్ను సస్పెండ్ చేస్తే.. బీసీ ఉద్యమం ఆగిపోతుందన్న భ్రమలోంచి రేవంత్ బయటకు రావాలి. నాలాంటి వాళ్ళు పక్కన ఉండొద్దని సీఎం రేవంత్ రెడ్డి కోరుకుంటున్నారు. పీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి చేసి రేవంత్ రెడ్డికి నన్ను సస్పెండ్ చేయించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తానన్న రాహుల్ గాంధీ హామీతోనే కాంగ్రెస్‌లో చేరాను. తన పక్కన వారు బానిస మాదిరి బతకాలని రేవంత్ కోరుకుంటారు. రేవంత్ చేసిన కులగణన చిత్తు కాగితంతో సమానం. సొంత మంత్రులకే ముఖ్యమంత్రి పేరు గుర్తుకు రావటం లేదు'' ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ఒక న్యాయం.. మల్లన్నకు ఒక న్యాయమా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం అగ్రవర్ణాలకు మాత్రమే అని వెల్లడించారు. అగ్రవర్ణాలను ఎక్కువ చూపి.. బీసీలను తొక్కిపెట్టారని మల్లన్న మండిపడ్డారు. రేవంత్‌కు నచ్చకున్నా.. 2028లో బీసీ ముఖ్యమంత్రి ఖాయం అంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలు చేశారు.

# ఎమ్మెల్యేకు వీరేశంకు న్యూడ్ వీడియో కాల్

- స్క్రీన్ రికార్డింగ్ చేసి బెదిరింపులు
- పోలీసులను ఆశ్రయించిన వేముల



అక్షరదర్బార్, నల్లగొండ: నల్గొండ జిల్లా నకిరేకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సైబర్ నేరగాళ్ల నుంచి నగ్న వీడియో కాల్ వచ్చింది. ఈ వీడియో కాల్ను సైబర్ నేరగాళ్లు స్క్రీన్ రికార్డింగ్ చేశారు. స్క్రీన్ రికార్డు చేసిన వీడియోను ఎమ్మెల్యే వీరేశం నంబర్కు పంపారు. డబ్బులు ఇవ్వకుంటే సోషల్మీడియాలో వీడియో పెడతామంటూ బెదిరించారు. వాట్సాప్ ద్వారా ఎమ్మెల్యేకు బెదిరింపు సందేశాన్ని సైబర్ నేరగాళ్లు పంపారు. ఈ నగ్న వీడియో కాల్ బెదిరింపులపై పోలీసులకు ఎమ్మెల్యే వేముల వీరేశం ఫిర్యాదు చేశారు. పోలీసుల సలహాతో సైబర్ నేరగాళ్ల నంబర్ను ఎమ్మెల్యే బ్లాక్ చేశారు. సైబర్ ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. ఆ నంబర్ మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు సీఐ తెలిపినట్లు, అది సైబర్ నేరగాళ్ల పన్నాగమని తెలిపారు.

# నకిలీ పురుగు మందుల విక్రయ ముఠా అరెస్ట్

- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- రూ. 34 లక్షల విలువ గల నకిలీ పురుగు మందులు స్వాధీనం



నిందితులను పట్టుకున్న పోలీసులు

అక్షరదర్బార్, హన్మకొండ: రైతులను మోసం చేస్తూ పెద్ద మొత్తంలో నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. వీరి నుండి సుమారు 34 లక్షల రూపాయల విలువ గల వివిధ కంపెనీల పేర్ల కలిగి వున్న నకిలీ పురుగు మందులతో పాటు, రెండు కార్లు, ఐదు సెల్ఫోన్లు, నకిలీ పురుగు మందు లేబుల్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పిల్ల నాగ వెంకట రంగారావు, ముద్దంగుల ఆదిత్య, కాట్రగౌడ భాస్కర్ రెడ్డి, పిట్ల నవీన్, దూదిమెట్ల శ్రీధర్ ఉన్నారు. నిందితులంతా హైదరాబాద్, నల్గొండ జిల్లాకు చెందినవారిగా గుర్తించారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడించారు. రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేశారు. కారులో పురుగు మందల డబ్బాలను గుర్తించిన పోలీసులు నిందితుల్లో ఒకడైన భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించారు. నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్నట్లుగా అంగీకరించడంతో హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతంలోని నిందితుల గోడౌన్ దాడి చేసి మిగితా నలుగురు నిందితులతో పాటు బెయర్, టాటా, కోర్టెవాతో మరో నాలుగు కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందులు, గడ్డి మందులను స్వాధీనం చేసుకున్నారు.



# జాతర పనులను పరిశీలించిన కలెక్టర్

రేగొండ, అక్షర దర్బార్ : మండలంలోని కొడవటంచ గ్రామంలో ఈనెల 9 నుండి 16 వరకు జరుగు కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాల పనులను భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ కు ఆలయ ఈవో మహేష్, చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, అర్చకులు స్వామి వారి శ్వేత వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి,అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, జిల్లా వైద్య అధికారి డా.మధుసూదన్, ఆర్ డబ్లు ఎస్ ఈ ఈ నిర్మల,విద్యుత్ డి ఈ పాపిరెడ్డి, ధర్మకర్తలు శ్రీధర్, ఓంకార్, సాంబయ్య, జోగేందర్, సుదర్శన్, మల్లయ్య, ఇల్లి కళావతి, తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రం ప్రారంభం

అక్షర దర్బార్, నర్సంపేట: పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద ఫ్రెండ్స్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో భరత్ రెడ్డి, ఓర్సు వెంకన్న, బిట్ల మనోహర్ పాల్గొన్నారు.

# ఆడపడుచే హంతకురాలు !

- వివాహిత శిరీష హత్య కేసులో ట్విస్ట్
- పోలీసుల అదుపులో నిందితులు
- మృతురాలి స్వగ్రామం పరకాల..



అక్షరదర్బార్, వరంగల్: వాళ్ళిద్దరూ స్నేహితులు. ఈక్రమంలోనే స్నేహితురాలి తమ్ముడితో ఆ మహిళ ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. ఆడపడుచుగా మారి స్నేహితురాలికి అండగా నిలవాల్సింది పోయి, తమ్ముడి భార్యనే అంత మొందించింది. ఈ విషయం బయటపడితే జైలు పాలవు తామనుకున్న మృతురాలి భర్త, అక్కతో కలిసి భార్య మృత దేహాన్ని మాయం చేయాలనుకున్నాడు. మృతురాలి మేనమామ అడ్డం తిరగడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అంతే కాదు మృతురాలి భర్తకు ఇది మూడో పెళ్లి అంటూ ఆమె బంధువులు ఆరోపిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తుంది. మలక్ పేట్లో వివాహిత శిరీష అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఆడపడుచే అంతమొందించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పోస్టుమార్టంలో వైద్యులు వెల్లడించినట్లుగా ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్యకు ముందు మత్తు మందు ఇచ్చినట్లు సమాచారం. కాగా మృతురాలి స్వగ్రామం వరంగల్ జిల్లా పరకాల. చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో కరీంనగర్కు చెందిన ఓ ప్రొఫెసర్ ఆమెను పెంచి పెద్ద చేశాడు.

## మృతదేహాన్ని మాయం చేయాలనుకొని..

నర్సింగ్ పూర్తి చేసిన శిరీష ఓ ప్రయివేటు ఆస్పత్రిలో నర్సుగా పనిలో చేరింది. అదే ఆసుపత్రిలో పనిచేసే సరితతో స్నేహం చేసింది. ఈ క్రమంలో సరిత తమ్ముడు వినయ్తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. అనంతరం 2016లో వినయ్, శిరీష ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టం లేకపోవడంతో శిరీషను పెంచి పెద్ద చేసిన ప్రొఫెసర్ ఆమెను దూరం పెట్టాడు. ఆ తర్వాత వినయ్–శిరీష దంపతులు హైదరాబాద్లో జీవనం సాగించారు. 2019లో వీరికి పాప జన్మించింది. వినయ్– శిరీష దంపతుల మధ్య పెళ్లయిన ఏడాది నుంచే తరచూ గొడవలు జరుగుతుండేవని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. వరుస గొడవల నేపథ్యంలో శిరీషను అంత మొందించాలనుకున్న ఆడపడుచు సరిత పథకం ప్రకారం శిరీష కుమార్తెను తల్లిదండ్రులతో స్వగ్రామం పంపించింది. ఈ క్రమంలో గతనెల 27న తొలుత ఆమెకు మత్తుమందు ఇచ్చి, అనంతరం దిండుతో ఊపిరాడకుండా నొక్కిపట్టి చంపినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అసలు విషయం బయటికి పొక్కితే జైలు పాలవుతామని భావించిన శిరీష భర్త వినయ్ సహా కుటుంబసభ్యులు ఆమె మృతదేహాన్ని మాయం చేయాలనుకున్నారు. అనుకున్నట్లుగా శిరీషకు ఛాతి నొప్పి వచ్చిందంటూ వినయ్ ఓ ఆసుపత్రిలో ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.




# ఘనంగా స్వయం పరిపాలన

అక్షర దర్బార్,ఆత్మకూర్: ఆత్మకూరు మండలం అక్కంపేట హైస్కూల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పదో తరగతి విద్యార్థి అంకిత డీఈవోగా, రవళిక హెచ్ఎంగా, శైలజ, రోహిత్ లోకేష్ పీఈటీలుగా, సాయి చంద్, వరుణ్, హర్ష, వర్షిత్, సాయికృష్ణ, వరుణ్ తేజ్, రోహిత్, జస్వంత్, నందిని, నిస్సి, ఐశ్వర్య, శ్రీజ, కిరణ్మయి ఉపాధ్యాయులుగా వ్యవహరించారు.

# ఇంటర్ పరీక్షలు షురూ..

- ఎగ్జామ్ సెంటర్లను తనిఖీ చేసిన అధికారులు



అక్షరదర్బార్, వరంగల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం 9 గంటల ఉంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ ఎగ్జామ్స్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల వద్దకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. ప్రతి విద్యార్థి హాల్ టికెట్స్తోపాటు క్షుణ్ణంగా పరిశీలించాకే అధికారులు పరీక్ష హాల్లోకి అనుమతించారు. 9 గంటలు సమయం దాటినా 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కూడా పరీక్షకేంద్రాల్లోకి అనుమతించారు.

## పరీక్షా కేంద్రాల తనిఖీ

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇంటర్ పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. ఈ సంద ర్భంగా పరీక్షా కేంద్రాల్లో పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు తీసుకున్న చర్యలపై సీపీ క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈసందర్భంగా పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లాలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ తనిఖీ చేశారు. అదేవిధంగా మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్ జిల్లా కేంద్రంలో ఇంటర్ పరీక్షకు ఆలస్యం అయిన విద్యార్థిని గుర్తించి, హుటాహుటిన తన వాహనంలో తీసుకెళ్లి సమయానికి పరీక్షా కేంద్రానికి చేర్చారు.

## అదనపు కలెక్టర్ సూచనలు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం వార్షిక పరీక్షలు ప్రారంభం కాగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వడ్డేపల్లిలోని ఎస్సార్ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ రెండు కేంద్రాల్లో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో ఏర్పాట్ల వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అదనపు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

# సింగరేణి బకాయిలను వెంటనే చెల్లించాలి

- రూ.35,645 కోట్లకు చేరిన బకాయిలు
- బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్



అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ప్రభుత్వం సింగరేణి సంస్థ బకాయిలను వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 5వ గని వద్ద కార్మికులను కలిసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిలో రాజకీయ జోక్యం అధికంగా పెరిగిపోయిందని విమర్శించారు. గుర్తింపు, సంఘము ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీ సంఘాలు సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలో వైఫల్యం చెందాయని ధ్వజమెత్తారు. 2024 డిసెంబర్ నాటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ట్రాన్స్ కో, జెన్ కో సంస్థలు రూ 35, 645 కోట్ల బకాయి ఉన్నాయని అన్నారు. ఈ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సింగరేణి ఆర్థికంగా, తీవ్రంగా దెబ్బతిని సంస్థ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో రూ. 25 వేల కోట్ల బకాయిలు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసము సంస్థ దగ్గర బొగ్గు కొనుగోలు చేసిన డబ్బులు కూడా సింగరేణి సంస్థకు ఇవ్వడం లేదని ఆయన దుయ్యబట్టారు. గెలిచిన సంఘాలు రాజకీయ నాయకుల డబ్బును, అధికారాన్ని ఉపయోగించి జోక్యం చేసుకొని, మోసపూరిత హామీలతో కార్మికులను మోసం చేశారని శ్రీనివాస్ విమర్శించారు. శ్రీనివాస్ వెంట సుజేందర్ మల్లేష్ తదితరులున్నారు

బుధవారం
05.03.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



# గ్రేటర్ టార్గెట్!

- జీడబ్ల్యూఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- ప్రజల వద్దకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- వరంగల్ పశ్చిమలోని 26 డివిజన్లలో పర్యటనలకు శ్రీకారం
- సమస్యలు తెలుసుకుంటూ స్థానికులతో మమేకం
- హామీలన్నీ అమలుచేస్తానని భరోసా..

అక్షరదర్బార్, హన్మకొండ: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై దృష్టి సారించారు. ఎలక్షన్‌కు ఇంకా ఏడాది ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే ప్రణాళికలు రచిస్తున్నారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలోనే వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 26 డివిజన్లలో క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారంచుట్టారు. అధికారులను వెంటబెట్టుకొని వాడవాడ కలియ తిరుగుతున్నారు. స్థానికులతో మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. కాలనీల్లో గుర్తించిన సమస్యలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరుపుతున్నారు. ఇప్పటికే 49, 4వ డివిజన్లను చుట్టి వచ్చిన నాయిని.. తాజాగా బుధవారం గ్రేటర్ వరంగల్ 8వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాది కాలంలోనే ఊహకందని విధంగా సుమారు రూ. 383 కోట్లు రాబట్టి పశ్చిమను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న నాయిని..

## సమావేశాలు.. సమీక్షలు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డివిజన్ పర్యటనలో భాగంగా 8వ డివిజన్ ఇందిరా నగర్, టైలర్ స్ట్రీట్ లో ఎమ్మెల్యే నాయిని పర్యటించారు. హనుమకొండ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి స్థానిక దుకాణ సముదాయాల యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేసి ట్రాఫిక్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన చేపడుతామని చెప్పారు. టైలర్ స్ట్రీట్ లో ఉన్న సైడ్ డ్రైన్ సమస్యను పరిశీలించి వెంటనే అంచనా వేయాలని అధికారులను కోరారు. అంతర్గత రోడ్లు పూర్తిగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పర్యటనలో చాలా చోట్లలో శిథిలావస్థకు చేరిన ఇళ్లను చూసిన ఎమ్మెల్యే వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని స్థానిక నాయకులకు విజ్ఞప్తి చేశారు. మురికి కాలువల పేరుకుపోయే చెత్తపై అసహనం వ్యక్తంచేశారు. 10వ డివిజన్ వైశ్య రోడ్డుపై నిర్మిస్తున్న డ్రైన్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.

## కోడ్ ముగిసిన వెంటనే పనులు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. టైలర్ స్ట్రీట్ నుండి సుధానగర్ వెళ్లే రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల నియమావళి ముగిసిన వెంటనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. నాలాల విస్తరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో నీటమునిగే ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఇంద్రానగర్ లో అంబేద్కర్ భవన్ నిర్మాణం, ప్రహరీ ఏర్పాటుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ

అక్షర దర్బార్, పరకాల: ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ అన్నారు. బుధవారం పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో లక్షడప్పుల వేల గొంతుల కళా ప్రదర్శనకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెండల మహేందర్ మాదిగ ఆధ్వర్యంలో డప్పు ర్యాలీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించకపోతే ఉప కులాలకు అన్యాయం జరుగుతుందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పునరాలోచన చేసి జనాభా దామాషా ప్రకారంగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి పెండల సురేష్ మాదిగ, బరిగల కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్షా కేంద్రాలను సందర్శించిన సీఐ

అక్షర దర్బార్, భీమదేవరపల్లి : ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా బుధవారం మండలంలోని ఏకేవీఆర్, మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై సాయిబాబుతో కలిసి సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులలో ఉన్న పోలీస్ సిబ్బందికి భద్రత ఏర్పాట్లు, పరీక్షా అనంతరం ఎస్కార్ట్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. మోడల్ స్కూల్ కళాశాల ప్రిన్సిపాల్, ఏకేవీఆర్ ప్రిన్సిపాల్ భూపతి శ్యామ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# గీత దాటొద్దు



- అంతర్గత విషయాలు బయట మాట్లాడొద్దు
- నా పనితీరు నచ్చకపోతే హైకమాండ్‌కు ఫిర్యాదు చేయొచ్చు
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- పీసీసీ అనుబంధ సంఘాలు, ఆదిలాబాద్ జిల్లా నేతలతో సమీక్ష

అక్షరదర్బార్, హైదరాబాద్: పార్టీ అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టొద్దని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ నేతలకు సూచించారు. అంతర్గత విషయాలపై బయట చర్చ పెట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇవాళ గాంధీభవన్‌లో పీసీసీ అనుబంధ సంఘాల సమావేశంతోపాటు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నేతలతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరై మాట్లాడారు. నివేదికలు ఇవ్వకపోయినా ఎవరి పనితీరు ఏంటనేది తమకు తెలుస్తుందని అన్నారు. పార్టీ కోసం పని చేస్తున్నది ఎవరు, పని చేసినట్లు యాక్టింగ్ చేస్తున్నది ఎవరనేది కూడా తెలుస్తుంది అంటూ చురకలు అందించారు. పార్టీ అంతర్గత విషయాలు బయట చర్చ చేయొద్దన్నారు. తన పనితీరు నచ్చకపోయినా రాహుల్, సోనియాకు ఫిర్యాదు చేయొచ్చు అన్నారు. ఐదు రోజుల క్రితం మధ్యప్రదేశ్ నుంచి రైలులో హైదరాబాద్‌కు వచ్చిన మీనాక్షి పార్టీని గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. సింప్లిసిటీకి ప్రాధాన్యమిస్తూ అంతర్గతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతూ సమావేశాలు నిర్వహిస్తున్నారు.



# మొదటిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

అక్షర దర్బార్, పరకాల : పరకాల పట్టణంలో మొదటి రోజు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరకాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలిరోజు మొత్తం 311 మంది విద్యార్థులకు గాను 296 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసినట్లు కళాశాల సీఎస్ వీర్య తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను క్లోజ్ చేయించి అవాంతరాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి

## బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

అక్షరదర్బార్, వరంగల్: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో పురోగతి అవసరం అని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. క్షేత్రస్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై బుధవారం ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం బల్దియా ప్రధాన కార్యాలయంతోపాటు కాశీబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వార్డు ఆఫీసర్లు ప్రతి రోజూ 50 దరఖాస్తులను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని, అవగాహన కోసం సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలని అన్నారు.



# చిన్నారికి దొంతి ఆశీర్వాదం

అక్షర దర్బార్, నర్సంపేట: మండలంలోని లక్నేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలోని అశోక్-రజిత దంపతుల కుమార్తె సహసన శుభకార్యం బుధవారం జరగగా నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి హాజరై ఆశీర్వదించారు.